


భక్తులకు ఇబ్బందులు లేకుండా..
యాదాద్రి క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. - 8లో



సైదన్న ఉత్సవాలకు వేళాయె
పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా ఉర్సు గురువారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. - 10లో



సస్పెన్షన్‌ను నిరసిస్తూ ..
కొండమల్లేపల్లి ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై సస్పెన్షన్ వేటు వేయడంతో విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. - 10లో

న్యూస్‌రీల్

సమావేశాన్ని విజయవంతం చేయాలి

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్లమెంట్ ఎన్నికలను సన్నద్ధతలో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ శాఖల అధ్యక్షులు హాజరై విజయవంతం చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సమావేశం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరై ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు.

పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర వేడుకలు

నల్లగొండ : నల్లగొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 26వ తేదీన భారత గణతంత్ర దినోత్సవం నిర్వహించనున్నారు. ఈ వేడుకల సందర్భంగా కలెక్టర్ హరిచందన ఉదయం 9 గంటలకు జాతీయ జెండాను ఎగుర వేయనున్నారు. 9.15 గంటలకు కలెక్టర్ ప్రసంగం, 9.50 గంటలకు ఆస్తుల పంపిణీ, శకటాల ప్రదర్శన, 10.00 గంటలకు ప్రశంసా పత్రాల ప్రదానం, 10.30 జాతీయ గీతాలాపన, కార్యక్రమం నిర్వహించనున్నారు.

తప్పుడు తూకాలు వేస్తే కఠిన చర్యలు



కాంటాను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

నల్లగొండ టూటౌన్ : తప్పుడు తూకాలు వేసి వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజారు కూరగాయాల మార్కెట్, చేపల మార్కెట్‌లో తూకపు రాళ్లు, యంత్రాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు.. వినియోగదారులను మోసం చేస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తూకపు రాళ్లకు ముద్రలు తప్పని సరిగా వేయించుకోవాలని సూచించారు. కాంటా వేసేటప్పుడు వినియోగదారులు నిశితంగా గమనించాలన్నారు. కార్యక్రమంలో రిపేరింగ్ లైసెన్స్ హోల్డర్లు, వినియోదారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికుల భద్రత డ్రైవర్లదే..



మాట్లాడుతున్న ఎంవీఐ సాయిప్రసాద్

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ప్రయాణికుల భద్రత డ్రైవర్లపైనే ఆధారపడి ఉందని ఎంవీఐ సాయిప్రసాద్ అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ డ్రైవర్లు నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. వాహనంతో రోడ్డుమీదికి వస్తే.. ఎదుటి వారికి వాహనం నడపరాదనే ఉద్దేశంతోనే జాగ్రత్తగా వాహనాలు నడపాలన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. ఎలాంటి ప్రమాదాలు చేయని డ్రైవర్లను ఆయన అభినందించారు. సమావేశంలో డీఎం రామ్మోహన్ రెడ్డి, అసిసెంట్ మేనేజర్ ప్రసాద్, ప్రభాకర్ రెడ్డి, శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ

నల్లగొండ : జాతీయ ఓటరు దినోత్సవం సంసందర్భంగా గురువారం ర్యాలీలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ పట్టణంలో ఉదయం 9.30 గంటలకు ఎన్‌జీ కళాశాల నుంచి రామగిరి మీదుగా క్లాక్‌టవర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్కడే అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీ, ఎన్జీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొననున్నారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీడీపీ నిధులు వెనక్కి

- ఒక్కో నియోజకవర్గానికి ఇచ్చింది రూ.3 కోట్లు
- అందులో మిర్యాలగూడలో ఖర్చు చేసింది రూ.1.90 కోట్లే
- పనులకు పూర్తిస్థాయిలో ప్రతిపాదలు ఇవ్వలేదంటున్న జిల్లా యంత్రాంగం
- మిగిలిన రూ.1.10 కోట్లు వెనక్కు తీసుకున్న ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నియోజకవర్గాల అభివృద్ధి పథకం (సీడీపీ) కింద ప్రభుత్వం ఇచ్చిన నిధులను ఖర్చు చేయకపోవడం వల్ల ఆ నిధులు వెనక్కి వెళ్లాయి. కరోనా కారణంగా గత ప్రభుత్వ హయాంలో రెండేళ్లపాటు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయించలేదు. ఆ తరువాత కేటాయించిన డబ్బులను ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఖర్చు చేశారు. 2023–24 సంవత్సరంలో ఇచ్చిన నిధులను ఐదుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎమ్మెల్సీలు నియోజకవర్గాల్లో ఖర్చు చేయగా, మిర్యాలగూడలో ఆ నిధులను పూర్తిగా ఖర్చుచేయక పోవడంతో అవి వెనక్కి వెళ్లాయి.

రూ.2 కోట్ల చొప్పున పాఠశాలల అభివృద్ధికి..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కరోనా కారణంగా మొదటి రెండేళ్లపాటు నియోజకవర్గ అభివృద్ధి నిధులను ఇవ్వని ప్రభుత్వం ఆ తరువాత మూడేళ్లపాటు వరుసగా నిధులను మంజూరు చేసింది. వాస్తవానికి ఒక్కో ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ నియోజకవర్గానికి ఏటా రూ.5 కోట్ల చొప్పున ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. అయితే ప్రభుత్వం 40 శాతం నిధులను అంటే రూ.2 కోట్ల చొప్పున పాఠశాలల అభివృద్ధి కోసం కోత విధించింది. ఆ నిధులను రాష్ట్ర స్థాయిలోనే తీసుకొని 'మన ఊరు – మన బడి' కింద పాఠశాలల అభివృద్ధికి వెచ్చించింది. మిగిలిన రూ.3 కోట్ల చొప్పున ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కేటాయించింది.

మిర్యాలగూడలో చేపట్టని అభివృద్ధి పనులు

ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇచ్చిన నిధులను కలెక్టర్లకు విడుదల చేస్తుంది. ఆ నిధులను సంబంధిత నియోజకవర్గంలోనే అభివృద్ధి పనులకు వెచ్చించాలి. ఇలా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఒక్కో నియోజకవర్గానికి ప్రభుత్వం రూ.3 కోట్ల చొప్పున ఇచ్చింది. ఎమ్మెల్యే /ఎమ్మెల్సీలు ఇచ్చే ప్రతిపాదనల ఆధారంగా జిల్లా యంత్రాంగం అభివృద్ధి పనులను చేపట్టాల్సి ఉంది. అయితే అప్పుడు మిర్యాలగూడ ఎమ్మెల్యేగా ఉన్న భాస్కర్‌రావు తమ నియోజవకర్గంలో రూ.1.90 కోట్ల పనులు చేపట్టేందుకే కలెక్టర్‌కు ప్రతిపాదనలు అందజేశారు. ఆ పనులను యంత్రాంగం చేపట్టింది. ఇంకా రూ.1.10 కోట్ల నిధులతో పనులు చేసేందుకు ప్రతిపాదనలను ఇవ్వలేదని, దీంతో పనులను చేపట్టలేదని జిల్లా యంత్రాంగం చెబుతోంది. ఈలోగా అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. దీంతో ఆ పనులకు మోక్షం లభించలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆ నిధులను ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు.

ఉపయోగపడని రూ.1.10 కోట్లు

ఓవైపు కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తి రెండేళ్లపాటు నిధులే రాలేదు. ఆ తరువాత వచ్చిన నిధుల్లో రూ.1.10 కోట్లు నియోజకవర్గ అభివృద్ధికి వెచ్చించలేదు. దీంతో గతేడాది ఎమ్మెల్యేగా ఉన్న భాస్కర్‌రావు తాను ప్రతిపాదనలను ఇచ్చానని, యంత్రాంగమే పనులు చేయలేదని చెబుతుండగా, జిల్లా యంత్రాంగం మాత్రం ప్రతిపాదనలే రాలేదని, అందుకే నిధులను వెనక్కి వెళ్లాయని చెబుతోంది. ఏదేమైనా నియోజకవర్గ అభివృద్ధికి రూ.1.10 కోట్లు ఉపయోగపడలేదు.

ప్రతిపాదనలు ఇచ్చా.. పనులు చేయలే

మిర్యాలగూడ నియోజకవర్గంలో రూ.3 కోట్ల నిధులకు సంబంధించిన ప్రతిపాదనలను జిల్లా కలెక్టర్‌కు అందజేశాను. కలెక్టర్ పరిశీలించి పనులను చేపట్టాల్సి ఉంది. రూ.1.10 కోట్లకు సంబంధించిన పనులను చేపట్టకపోవడం వల్లే ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకొని ఉండొచ్చు.

–నల్లమోతు భాస్కర్‌రావు, మాజీ ఎమ్మెల్యే



బాలికా దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హరిచందన, వివిధ శాఖల అధికారులు

చదువుతోనే భవిష్యత్తుకు బాటలు

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ : చదువు ద్వారానే తమ ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కలెక్టర్ హరిచందన సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో 'ఆడపిల్లను రక్షిద్దాం – ఆడపిల్లను చదివిద్దాం' అనే నినాదంతో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు అందరూ చదువుకోవడంతో పాటు, కుటుంబం, పొరుగువారు చదువుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో గొప్పగా రాణిస్తున్నారని దీనికి కారణం చదువే అన్నారు. చిన్నవయసులో పెళ్లిళ్లు చేసుకుని కష్టాలను కొని తెచ్చుకోవద్దన్నారు. బాగా చదివి జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో స్థిరపడాలని, సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వ అందజేస్తున్న పథకాలను మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న కలెక్టర్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి మాట్లాడుతూ సమాజంలో బాలికల రక్షణ, సంరక్షణ, హక్కులు, వైద్యం, విద్య, పోషకాహారం, నివాసం, సామాజిక, న్యాయ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 31 మందికి ప్రశంసా పత్రం, మెమోంటోలు అందజేశారు. అంతకుముందు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, డీఎంహెచ్‌ఓ కొండల్ రావు, ఎస్ఐ అంజలి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ హరిచందన



మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

నల్లగొండ : మంజూరై పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కలెక్టర్ హరిచందన ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలిసి పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ, విద్య, వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ ఎస్ఈలు, ఈఈలు, డీఈలతో ఆయా శాఖలు చేపట్టిన పనులు ప్రగతిపై సమీక్షించి పలు సూచనలు చేశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఇప్పటివరకు మొదలు అంగన్‌వాడీ భవనాలు, పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవనాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న పంచాయతీ భవనాలు, శ్మశాన వాటికల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పీఆర్ ఎస్ఈ తిరుపతయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ విరూపాక్ష, జెడ్పీ ఈసీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి, సీపీఓ బాలశౌరి, డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు తదితరులు ఉన్నారు.

సాగునీరు విడుదల చేసి పంటలను కాపాడాలి

- మంత్రి ఉత్తమ్‌కు రైతు సంఘం నాయకుల వినతి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ ఎడమకాల్వ ఆయకట్టు పరిధిలో నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లోని రైతులు సాగునీరు వస్తుందన్న ఆశతో కొందరు రైతులు వరిసాగు చేశారని.. తీరా సాగునీరు అందకపోవడంతో అవి ఎండిపోయే దశకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు, బావులు ఎండిపోతున్నాయన్నారు. సాగర్ రిజర్వాయర్ 520 అడుగుల మేరకు నీటి నిల్వ ఉన్నందున ప్రస్తుతానికి 15టీఎంసీల నీటిని వాడుకోవడానికి అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి 10రోజుల పాటు సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి భూగర్భజలాలు పెంచడానికి చెరువులు, కుంటలు నింపి ఎండిపోతున్న వరి పంటను కాపాడాలన్నారు. వారి వెంట శోభన్, బసవయ్య ఉన్నారు.

మెరుగైన విద్య అందించడమే లక్ష్యం

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



కొంపల్లిలో తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మి

మునుగోడు: నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే తన ప్రధాన లక్ష్యమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి అన్నారు. మునుగోడు మండలంలోని కొంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.24 లక్షల వ్యయంతో నిర్మించిన మూడు తరగతి గదులను ఎమ్మెల్యే తన సతీమణితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్యాపరంగా అండగా ఉంటామని తెలిపారు. తరగతి గదుల ప్రారంభోత్సవానికి వస్తున్న ఎమ్మెల్యే దంపతులపై ఆ గ్రామ ప్రజలు, విద్యార్థులు పూలు చల్లుతూ ఘన స్వాగతం పలికారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్

నల్లగొండ టౌన్ : సంక్షేమ వసతిగృహ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీఎస్ జీఓ సంఘం కృషి చేస్తుందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు మంత్రవాది శ్రవణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో జరిగిన హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. 11 నెలలుగా డైట్ బిల్లులు లేక సంక్షేమ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ అధికారి ఖాజానజీమ్‌అలీ అప్సర్, ఏడబ్ల్యూఓ కృష్ణవేణిని సన్మానించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు గామయ్య, రమ్యసుధ, స్వామి, లక్ష్మయ్య, మనోజ్, ప్రదీప్, మాధవి, మురళి, రమాదేవి, అనురాధ, దుర్గ, వెంకటయ్య, షఫీ, కమల, సోమేశ్వరి, స్వప్న పాల్గొన్నారు.

రక్తహీనతను నివారించేలా..

- ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమాన్ని చేపట్టిన వైద్య ఆరోగ్యశాఖ
- 8వ తరగతి నుంచి ఇంటర్ చదివే బాలబాలికలకు రక్త పరీక్షలు



గంధంవారిగూడెంలోని గురుకుల పాఠశాలలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

నల్లగొండ టౌన్ : యుక్త వయస్సులోని బాలబాలికలలో రక్తహీనతను నివారించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమాన్ని చేపట్టింది. బుధవారం జిల్లా కేంద్రంలోని గంధంవారిగూడెంలోని ప్రభుత్వం బాలికల గురుకుల పాఠశాలలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్ రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 8వ తరగతి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు చదువుతున్న మొత్తం 50,592 మంది బాలబాలికలకు రక్త, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రాథమిక విద్య, ఇంటర్ విద్యా శాఖల సమన్వయంతో వైద్య ఆరోగ్యశాఖ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రభుత్వ సెలవులు, ఆదివారాలు మినహా మిగతా అన్ని రోజుల్లో బాలబాలికలందరికీ పరీక్షలు పూర్తయ్యే వరకు నిరంతరాయంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడానికి అవసరమైన ఏర్పాట్లు చేసింది. రక్తహీనతను నివారించడం ద్వారా చదువుకునే విద్యార్థుల ఆరోగ్యాలను పరిరక్షించేలా ప్రభుత్వ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

13 బృందాల ఏర్పాటు

బాలబాలికలకు రక్త పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 13 ఆర్‌బీఎస్‌కే మొబైల్ హెల్త్ బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఫార్మసిస్టు, ఏఎన్‌ఎంలు ఉంటారు. హిమోగ్లోబిన్ శాతాన్ని బట్టి మూడు రకాలుగా ఎనీమియాను గుర్తిస్తారు. 11 నుంచి 11.9 హిమోగ్లోబిన్ ఉంటే మైల్డ్ అనేమియాగా గుర్తించి వారు పౌష్టికాహారం తీసుకోవాలని సూచిస్తారు. 10.9 నుంచి 8 హిమోగ్లోబిన్ ఉంటే మోడ్రెట్ ఎనీమియాగా గుర్తించి వారికి ఐరన్ ట్యాబెట్లు అందిస్తారు. 8కంటే తక్కువ హిమోగ్లోబిన్ ఉంటే సివెర్ ఎనీమియాగా గుర్తించి వారికి ట్యాబెట్లు మందులను ఇవ్వడంతో పాటు చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు.

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న బాలబాలికలు ఇలా..

తరగతి	బాలురు	బాలికలు
8వ	5,989	6,210
9వ	5,763	6,086
10వ	6,078	6,051
ఇంటర్ మొదటి	2,777	4,040
ఇంటర్ రెండవ	3,227	4,371
మొత్తం	23,834	26,758

“ప్రతీ విద్యార్థి పరీక్షలు చేయించుకోవాలి



ఎనీమియా ముక్త్‌భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న క్యాంపుల్లో ప్రతి విద్యార్థి తప్పని సరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలి. వైద్యులు సూచించిన విధంగా పౌష్టికాహారం తీసుకోవాలి. 8వ తరగతి నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం చదివే బాలబాలికలందరికీ పరీక్షలు చేస్తాం.

– డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావు, డీఎంహెచ్‌ఓ

నిలిచిన సాగర్ భూముల లీజు



మూసి ఉన్న ఫిల్టర్ హౌస్ భూమి గేటు

సాక్షి ఎఫెక్ట్..

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌లో రోడ్డువెంట గల ఐదు ఎకరాల భూమి ఓ స్వచ్ఛంద సంస్థకు అప్పగించే విషయంలో అధికారులు వెనుకకు తగ్గారు. ఆ భూమి ఉన్న గేటుకు తాళం వేశారు. లీజుపేరుతో కోట్లాది రూపాయల విలువైన భూములను స్వచ్ఛంద సంస్థలకు అప్పగిస్తుండడంతో.. ఈనెల 20వ తేదీన 'సాక్షి'లో 'సాగర్ భూములు సమర్పయామి' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి స్పందించారు. ఇటీవల ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంట వెళ్లి తిరిగి మంగళవారం నాగార్జునసాగర్‌కు వచ్చారు. ఈ భూమి విషయాన్ని ఆరాతీసి బుధవారం నల్లగొండకు వెళ్లి జిల్లా చీఫ్ ఇంజనీర్‌ను కలిశారు. ప్రజలకు ఉపయోగపడే స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని సూచించినట్లు తెలిసింది. నందికొండ భూములు ఆక్రమణకు గురికాకుండా చొరవ చూపడంపై స్థానికులు ఎమ్మెల్యేను పలువురు ప్రశంసిస్తున్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రావొద్దు



మిషన్ భగీరథ ప్లాంటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

మిర్యాలగూడ : రానున్న వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామంలో మిషన్ భగీరథ ప్లాంటును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మిషన్ భగీరథ నీళ్లు సరిగా సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోని చివరి వీధి వరకు నల్లాల ద్వారా తాగునీటిని అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. వారి వెంట ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ వంశీకృష్ణ, పాపారావు, డీఈ సంపత్‌కుమార్, అన్వర్, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి





నేర సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎస్పీ చందనాదీప్తి, పోలీస్ అధికారులు

- ఎస్పీ చందనాదీప్తి

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ చందనాదీప్తి ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో మరణాల వల్ల బాధితుల కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా చిన్నాభిన్నం అవుతుందన్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రత కమిటీలు వేయాలని, ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రమాదాల నివారణ కోసం ప్రతిరోజు బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేయాలని, వారి కుటుంబ సభ్యులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. పోలీస్ శాఖ చేపట్టిన 16 ఫంక్షనల్ వర్టికల్స్‌ను అమలు చేయాలన్నారు. పాత గంజాయి, పేకాట, రేషన్ బియ్యం దందాపై నిఘా ఉంచి కట్టడికి చర్యలు చేపట్టాలని, నిరంతరం పోలీస్ గస్తీ ఉండాలని, బహిరంగా ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలన్నారు. ప్రతి పిర్యాదును సమగ్రంగా విచారించాలన్నారు. పదే పదే నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదుకు సిఫార్సు చేయాలన్నారు. భూ సమస్యలు శాంతి భద్రతల సమస్యగా మారకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు నారాయణసింగ్, విఠల్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వెంకటగిరి, సైదా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడు మృతి

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన కేవీఎస్‌రాజు(18), కార్తీక్‌లు పని నిమిత్తం ఈ నెల 23(మంగళవారం)న బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమాచారం అందుకున్న క్షతగాత్రుల కుటుంబ సభ్యులు కోదాడ ఆస్పత్రికి చేరుకుని వారిని విజయవాడకు తరలించారు. అక్కడ ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కేవీఎస్ రాజు బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మునగాల పోలీసులు తెలిపారు.

మట్టపల్లి నృసింహుడి నిత్యకల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్,ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు. బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మంత్రి కోమటిరెడ్డికి లడ్డూప్రసాదాన్ని అందజేస్తున్న ఈఓ

- యాదాద్రి కొండపై మౌలిక సౌకర్యాలు కల్పించాలి
- త్వరలోనే 'బస్వాపురం' సమస్యను పరిష్కరిస్తాం
- అధికారుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. యాదగిరిగుట్ట ప్రెసిడెన్షియల్ అతిథిగృహంలో బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. క్షేత్రానికి వచ్చే రాబడి కోసం కాకుండా భక్తులకు కావాల్సిన అవసరాలపై పట్ల దృష్టి సారించాలన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొద్దిరోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి, యాదగిరిగుట్ట, బస్వాపురం ప్రాజెక్టు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. యాదగిరిగుట్టకు మంజూరైన కోర్టు కోసం భవనాన్ని నిర్మించాలన్నారు. బస్వాపురం ప్రాజెక్టుకు సంబంధించి, 3 లక్షల క్యూబిక్ మీటర్ల బండ్ వర్క్ 93శాతం పూర్తయిందని, 11.39 టీఎంసీ నీళ్లను నిల్వచేయవచ్చని, ముంపు బాధితులకు నష్టపరిహారం పునరావాసం చర్యలు చేపట్టాలన్నారు. మల్లన్న సాగర్ నుంచి 16 కిలోమీటర్ల పైప్‌లైన్ బ్యాలెన్స్ వర్క్ నెలలో పూర్తిచేసి మిషన్ భగీరథ తాగునీరు అందించాలన్నారు. విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే. జెండగే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్ రావు, ఈఓ రామకృష్ణారావు, డీసీపీ రాజేష్‌చంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడిని దర్శించుకున్న మంత్రి

యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని అంతకుముందు ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభూవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానాలయం ముఖమండపంలోని ఉత్సవ మూర్తుల వద్ద పూజలు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభానికి మంత్రి మొక్కులు చెల్లించారు. అనంతరం వేద మండపంలో ఆలయ ఆచార్యులు వేద ఆశీర్వచనాలను జరిపించగా, లడ్డూ ప్రసాదాన్ని ఆలయ ఈఓ మంత్రి వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కలెక్టర్ హనుమంతు కే.జెండగే, తదితరులున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- రిటైర్డ్ ఐఏఎస్ చోల్లేటి ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న చొల్లేటి ప్రభాకర్

కోదాడఅర్బన్ : ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైందని, ప్రజలు తమ హక్కును నిజాయితీగా వినియోగించుకోవాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చోల్లేటి ప్రభాకర్ పిలుపునిచ్చారు. బుధవారం కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో రాజనీతిశాస్త్రం విభాగం, ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం–ఓటు హక్కు ప్రాధాన్యత అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కలలు కనండి సాకారం చేసుకోండి అనే అబ్దుల్ కలాం మాటలను ఆచరణలో పెడితే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ఎన్నికల్లో అవనీతి, బంధుప్రీతికి తావు లేకుండా ఓటు వేసినప్పుడే మంచి పాలన, పాలకుడు వస్తాడన్నారు. అనంతరం రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్ రచించిన యూపీఎస్సీ సివిల్స్ ఎగ్జామ్, ఫైర్ ఆఫ్ హిం ఐఏఎస్ అనే పుస్తకాన్ని కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌ను కళాశాల అధ్యాపకులతో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగు, రిటైర్డ్ ఇంటర్ విద్యాధికారి రాజారాంసింగ్, నిర్మల, రాజనీతి అధ్యాపకులు సైదమ్మ, ఎస్‌ఎం రఫీ, ఇంకా ప్రకాష్, రమేష్, వెంకటేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

చెత్తకుప్పలో మగ శిశువు

- హైదరాబాద్‌కు తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

కొండమల్లేపల్లి : అప్పుడే పుట్టిన మగ శిశువును చెత్తకుప్పలో వదలేసి మాతృత్వానికి మచ్చ తెచ్చిన ఘటన కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులోని వాసవీ బజార్‌లో బోయ సంధ్య ఇంటి వెనక గుర్తుతెలియని వ్యక్తులు అప్పుడే జన్మించిన మగ శిశువును చెత్తకుప్పలో వదిలేసి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం శిశువు ఏడుపును గమనించిన రమావత్ రజిత అక్కడికి చేరుకొని చూడగా శిశువు కనిపించడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. దీంతో సమాచారం ఐసీడీఎస్ అధికారులు, కొండమల్లేపల్లి ఎస్ఐ వీరబాబు శిశువును దేవరకొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మెరుగైన వైద్యం కోసం శిశువును నీలోఫర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. శిశువు పెదవి సరిగా లేకపోవడం, గ్రహణం పట్టినట్లుగా ఉండడంతోనే వదిలేసి ఉండొచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. శిశువును ఆస్పత్రికి తీసుకెళ్లిన వారిలో సూపర్‌వైజర్ రాధ, 9వ వార్డు మెంబర్ బొడిగె లక్ష్మిశ్రీ, అంగన్‌వాడీ టీచర్ శోభ, జ్యోత ఆయా మాణిక్యమ్మ తదితరులున్నారు.

కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణను ప్రారంభించాలి


మాట్లాడుతున్న శంకర్ ముదిరాజ్

నేరేడుచర్ల : రాష్ట్రంలో ఉన్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు కమ్యూనిటీ పారామెడిక్ శిక్షణను ప్రారంభించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన నేరేడుచర్ల, పాలకీడు మండలాల ఆర్‌ఎంపీ, పీఎంపీల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలకు పారామెడిక్ శిక్షణను పూర్తి చేసిన తరువాత పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌ఎంపీ, పీఎంపీల నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు సత్యనారాయణ, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న గౌడ్, ఉపాధ్యక్షుడు మన్సూర్ అలీ, కస్తాల వెంకన్న, పిచ్చయ్య, సైదులు, జానయ్య ఉన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

సూర్యాపేట క్రైం : తాగిన మత్తులో ఓ మండల ప్రజాప్రతినిధి కుమారుడు వీరంగం సృష్టించాడు. నలుగురు యువకులతో కలిసి రోడ్డుపై వెళ్తున్న ఆటో డ్రైవర్‌పై తూకం రాయితో దాడి చేయడంతో తల పగిలిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఓ మండల ప్రజాప్రతినిధి కుమారుడు నెమ్మాది బిట్టు స్నేహితులతో మద్యం సేవించాడు. స్నేహితులు నిఖిల్, బిట్టు మధ్య తాగిన మైకంలో ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో బిట్టు నిఖిల్‌ను కొట్టుకుంటూ ఖమ్మం చౌరస్తా వద్దకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నిఖిల్‌పై ఆవేశంతో పక్కనే ఉన్న తూకం రాయి తీసుకొని విసరడంతో అటువైపు వెళ్తున్న జానీ అనే ఆటో డ్రైవర్‌కు తగలడంతో తలకు తీవ్రమైన గాయమైంది. అనంతరం అక్కడి నుంచి యువకులు పరారయ్యారు. అక్కడే ఉన్న స్థానికులు జానీని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జానీ ఫిర్యాదు మేరకు బిట్టు, నిఖిల్‌తో పాటు మరో ఇద్దరు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం పోలీసులు నిఖిల్‌ను అదుపులోకి తీసుకోగా బిట్టు పరారీలో ఉన్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

రాజాపేట : కుక్కల దాడిలో పలు గొర్రెలు మృతిచెందాయి. ఈ ఘటన రాజాపేట మండలంలోని సోమారం గ్రామంలో చోటుచేసుకుంది. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పుప్పాల బాలనర్సయ్య ఇటీవల గొర్రెలు కొనుగోలు చేశాడు. వాటిని గతంలో ఉన్న గొర్రెలతో కలిపి మంగళవారం రాత్రి తన కొట్టంలో కట్టివేశాడు. కాగా అర్ధరాత్రి వేళ వీధికుక్కలు కొట్టంలోకి చొరబడి గొర్రెలపై విచక్షణారహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. ఉదయం రైతు వచ్చి చూసేసరికి 8 గొర్రెలు మృతి చెందాయి. రూ. 90వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కుక్కలను నివారించాలని అధికారులను వేడుకుంటున్నాడు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సంపత్

హాలియా : జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు పెద్దవూర మండలం కేకే తండాకు చెందిన సంపత్ ఎంపికై నట్లు కోచ్ ఆవుల చంద్రశేఖర్ యాదవ్ తెలిపారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ –19 బాలుర విభాగంలో సంపత్ పాల్గొని ప్రతిభ కనబర్చి తెలంగాణ రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. సంపత్ నల్లగొండలోని ఎస్ఆర్ జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు.

కబడ్డీ పోటీలకు రాముడు


రాముడు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన మాళావత్ రాముడు కర్ణాటకలోని మాండ్య జిల్లాలో ఈ నెల 27 వరకు జరిగే జాతీయ స్థాయి కబడ్డీ అండర్ 19 జట్టుకు ఎంపికై నట్లు జైహనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి బుధవారం తెలిపారు. రాముడు ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి చాక్లెట్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

భువనగిరి క్రైం : గంజాయి చాక్లెట్లను రవాణా చేస్తున్న వ్యక్తిని బుధవారం ఎక్సైజ్ భువనగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ బి.నాగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గంజాయి చాక్లెట్ల రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన తపన్ కుమార్ పరిడ భువనగిరి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా ఉండగా టాక్స్‌ఫోర్స్, ఎక్సైజ్ స్టేషన్స్ టీంల ఆధ్వర్యంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేసి 24 ప్యాకెట్లలో 869 గంజాయి చాక్లెట్లు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయి చాక్లెట్ల బరువు సుమారు 4.557 కిలో గ్రాములు ఉన్నాయి. ఈ దాడుల్లో అధికారులు బి.రాధకిషన్, ఎస్ఐలు పి.సాయికిరణ్‌రెడ్డి, జి.నాగరాజు ఉన్నారు.

చంపేసి.. ఆపై కాల్చేశారు !

- భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి శివారులో దారుణం
- హతుడిని గుర్తుపట్టకుండా పెట్రోల్‌తో కాల్చేసినట్లు ఆనవాళ్లు

భువనగిరి క్రైమ్ : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో బుధవారం దారుణం వెలుగుచూసింది. గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసి గుర్తుపట్టకుండా హతుడి ముఖం ఇతర శరీర భాగాలను పెట్రోల్‌తో కాల్చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. నాగిరెడ్డి గ్రామ శివారులోని కాళేశ్వరం కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలాన్ని భువనగిరి ఏసీపీ సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఇతర పోలీస్ సిబ్బంది పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో దుండగులు వారం రోజుల క్రితమే హత్య చేసి ఉంటారని భావిస్తున్నారు. హతుడు సుమారు 5.4 అంగుళాల ఎత్తు, నీలి రంగు జీన్స్ ప్యాంటు, మెరూన్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడు. హతుడు ఎవరు..? ఎక్కడో హత్య చేసి ఇక్కడికి తీసుకొచ్చి కాల్చేశారా..? ఇక్కడే చంపేసి ఆపై ఆనవాళ్లు దొరక్కుండా చేశారా? హత్యకు గల కారణాలు ఏమిటి? ఇలా పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తొలుత మిస్సింగ్ కేసులపై దృష్టి సారించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటనాస్థలిలోనే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలి

- ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్ రెడ్డి కోరారు. బుధవారం ఎంజీయూలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమాశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలో 163 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఏర్పాటు చేసి మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అధునాతన పోకడలతో పోటీపడుతున్న తరుణంలో మంచి చెడులను ప్రజలకు తెలియజేయాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానం క్షేత్ర స్థాయికి చేరితేనే ఫలితాలు సాధిస్తామన్నారు. ఇటీవల మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో యూనివర్సిటీ నుంచి పలు కార్యక్రమాలపై ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ కనబర్చిన వలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. సమావేశంలో రిజిస్ట్రార్ రవి, ఎన్ఎస్ఎస్ అధికారులు మౌనిక, మద్దిలేటి ఈసీ సభ్యులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాగర్‌లో ఫిల్టర్ హౌస్ సామగ్రి చోరీ


జలాశయ తీరం నుంచి వేసిన పైపులైన్ వెంట తొలగించిన సపోర్ట్ రాడ్స్

నాగార్జునసాగర్: సాగర్ జలాశయతీరంలో సుమారు కోటిరూపాయలతో నిర్మించిన ఫిల్టర్‌హౌస్ సామగ్రిని దుండగులు అపహరించారు. జలాశయతీరం నుంచి పైవరకు వేసిన పైపులైన్‌ట్రాక్, సిమెంట్‌పైపుల వెంట సపోర్ట్‌గా వేసిన ఇనుప చానల్ పంట్టీలు, మోటార్లు, గేట్‌వాల్స్ సకలం కనపడకుండా పోయాయి. గ్యాస్‌కట్టర్లను తెచ్చి ట్రాక్‌ను ముక్కలుగా చేస్తూ నిత్యం ఆటోల్లో ఇనుప సామగ్రిని తరలిస్తున్నట్లు సమాచారం. ఆ భూమిలో ఉన్న కంపచెట్లను తొలగించడంతో గ్యాస్‌కట్టర్లు, గ్యాస్ సిలిండర్, విద్యుత్ వైర్లు కనపడ్డాయి. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ఈ పాటికే కింది నుంచి పైవరకుగల కేబుల్ వైరు అందిన కాడికి సామగ్రినంతా దుండగులు తరలించుక పోయారు. ఈ ఘటనపై బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎన్నెస్పీ అధికారులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చోరీలో ఎన్నెస్పీ ఉద్యోగుల పాత్రపై ఆరాతీస్తున్నట్లు సమాచారం.

రేషన్ బియ్యం పట్టివేత

చౌటుప్పల్ : మండల పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద బుధవారం పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సీఐ ఎస్.దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.... యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్‌తండాకు చెందిన ధీరావత్ మధు (22), అదే గ్రామానికి చెందిన ధీరావత్ రాము (23)లు సూర్యాపేట జిల్లాలోని పలు గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుంటారు. ఆయా గ్రామాల్లో0 10రూపాయల చొప్పున కొనుగోలు చేసే వీరు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిసరాల్లోని రైస్‌మిల్లుల్లో 15రూపాయల వంతున అమ్ముతుంటారు. అందులో భాగంగా అశోకా లీలాండ్ ఆటోలో 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా టోల్‌ప్లాజా వద్ద పోలీసులు పట్టుకున్నారు. బియ్యం, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మత్స్యకారులకు చిక్కిన 'వెండి' చేపలు


మత్స్యకారుల వలకు చిక్కిన పలితెజల్ల చేపలు

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం యాతవాకిల్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు 10 నుంచి 15కేజీల పలితెజల్ల (వెండి) జల్ల చేపలు చిక్కాయి. కృష్ణానదిలో మాత్రమే 2 నుంచి 3 కేజీల బరువుతో లభ్యమయ్యే పలితెజల్ల చేపలు వేములూరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలకు చిక్కడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేములూరు రిజర్వాయర్‌లో నీరు రోజు రోజుకూ అడుగంటుండటంతో ఎప్పుడూ దొరకని చేపలు మత్స్యకారులకు లభ్యమవుతున్నాయని సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, బీసీసెల్ మండల అధ్యక్షుడు ఎల్లావుల నాగయ్యయాదవ్, వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

సాయం చేసేందుకు వెళ్తూ మృత్యుఒడికి

- డీసీఎం ఢీకొని డ్రైవర్ దుర్మరణం
- మృతుడు ఏపీలోని నంద్యాల వాసి

నల్లగొండ క్రైం : రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపి సాయం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తున్న ఓ డీసీఎం డ్రైవర్‌ను మరో డీసీఎం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నల్లగొండ పట్టణ శివారులో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పట్టణంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన మహ్మద్ ఆరీఫ్ (26) డీసీఎం డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆరీఫ్ తన డీసీఎంలో బియ్యాన్ని లోడు చేసుకుని హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో మంగళవారం అర్ధరాత్రి నల్లగొండ పట్టణ శివారు పానగల్ బైపాస్‌కు చేరుకున్నాడు. ఈ క్రమంలో అక్కడ మిర్చిలోడుతో వెళ్తున్న మీని ఆటో టైరు పంక్చర్ కావడంతో అదుపుతప్పింది. దీంతో ఆటోలోని మిర్చి బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. దీనిని గమనించి ఆరీఫ్ తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి ఆటో డ్రైవర్‌కు సహాయం చేసేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో డీసీఎం ఆరీఫ్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు బషీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

బాలుడి హత్య కేసులో జీవిత ఖైదు

- ప్రియుడితో కలిసి కన్నకొడుకును గొంతునులిమి చంపిన తల్లి
- ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు

రామగిరి(నల్లగొండ): ప్రియుడితో కలిసి తొమ్మిదేళ్ల కుమారుడిని కడతేర్చిన కేసులో ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ప్రధాన న్యాయమూర్తి నాగరాజు బుధవారం తీర్పు వెల్లడించారు. నల్లగొండ మండలం బుద్ధారం గ్రామానికి చెందిన పల్లెటి వెంకన్నకు నాంపల్లి మండలం సల్లవానికుంట గ్రామానికి చెందిన విజయతో 2007వ సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి అఖిల్, నాగరాజు సంతానం. వెంకన్న ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య విజయ వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డి వద్ద భార్యభర్తలు కూలికి వెళ్తుంటారు. ఈ క్రమంలో తోకల వెంకట్‌రెడ్డి విజయతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఒక రోజు విజయతో పాటు చిన్న కుమారుడు నాగరాజు పని ప్రదేశానికి వెళ్లాడు. ఆ రోజు వెంకట్‌రెడ్డితో విజయ కలిసి ఉండగా నాగరాజు చూసి తండ్రి వెంకన్నకు చెప్పాడు. దీంతో విజయ, వెంకట్‌రెడ్డిలను వెంకన్న మందలించి పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు.

విషయం తండ్రికి చెప్తాడని గొంతు నులిమి..

కొన్ని రోజుల తర్వాత 2020 ఫిబ్రవరి 21వ తేదీన వెంకట్‌రెడ్డి ఫోన్ చేసి పనికి రావాలని వెంకన్నను కోరగా వెళ్లాడు. గంట తర్వాత వెంకన్న తిరిగి ఇంటికి వచ్చాడు. అనంతరం పని నిమిత్తం రాములబండ గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో వెంకట్‌రెడ్డి వెంకన్న ఇంటికి వచ్చి విజయతో కలిసి ఉన్నాడు. దీనిని విజయ చిన్నకుమారుడు నాగరాజు చూశాడు. విషయం తండ్రికి చెప్తాడని కంగారు పడిన విజయ, వెంకట్‌రెడ్డిలు నాగరాజు(9)ను గొంతు నులిమి చంపేశారు. వెంకన్న ఇంటికి వచ్చి చూడగా కొడుకు మంచంలో విగతజీవిలా పడి ఉన్నాడు. నాగరాజు గొంతుపై నులిమిన ఆనవాళ్లు ఉన్నాయి. భార్య విజయ కనిపించలేదు. గ్రామస్తులను ఆరా తీయగా వెంకన్న ఇంట్లో లేని సమయంలో మధ్యాహ్నం వెంకట్‌రెడ్డి ఇంటికి వచ్చినట్లు చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన వెంకన్న నల్లగొండ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సీఐ ప్రసాద్, ఎస్ఐ కె.చంద్రశేఖర్‌రెడ్డి నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కానిస్టేబుల్ ఎస్.సురేష్, బి.సుమన్, కోర్టు లైజన్ ఆఫీసర్ పి.నరేందర్ ఆధారాలు కోర్టుకు సమర్పించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.శ్రీనివాస్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు ఏ1 విజయ, ఏ2 వెంకట్‌రెడ్డిలకు జీవిత ఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.